

# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### సందానీగాడి స్వర్గం

**మా తెలుగు** పండిట్ ప్రతిరోజూ మమ్మల్ని చంపుకుతినే విషయం "ఈ రోజు వార్తా పత్రిక చదివారా?" అని. అంతేకాకుండా అప్పుడప్పుడూ లైబ్రెరీ పిరేడ్ అని పెట్టి అక్కడ పుస్తకాలు చదివి, మర్నాడు ఆయన పిరేడ్లో ఆ కథ చెప్పాలి.

సందానీకి ఈ తెలుగు పండిట్ అన్నా, విధించే ఈ శిక్షలన్నా మహా చిరాకు. "ఏ.వీ రమణీ.. నువ్వు చదివి నాకు చెప్పు" అనేవాడు. నాకు ఉత్సాహమే కాబట్టి లైబ్రెరీ పిరేడ్లో సత్యహరిశ్చంద్రుడి కథ చదివి, సందానీకి చెప్పాను. నేను చదువుతుంటే - అడ్డుపడి "తెలుగుల చెప్పు" అన్నాడు.

"పూర్వం ఇక్ష్వాకుల వంశంలో సత్యహరిశ్చంద్రుడనే రాజు పరిపాలించాడు. అతను ఆడి తప్పని సత్యవాక్య పరిపాలకుడు. అతని రాజ్యంలో సుభిక్షంగా నెలకి నాలుగు వానలు కురిసేవి."

"ఇది తెలుగే కదరా?" అన్నాను. సందానికి ఒళ్ళు మండిపోయింది. బాసింపట్టం వేసుకుని కూర్చుని ముక్కుతో మంత్రాలు చదువుతూ, "హో...సర్వం...కు...కున్హం...హో ... పుఃహ్యం వి..నిక్ష..ర్వం..- గిట్ల గుళ్ళ మంత్రాలు సదివేది నీకీ సమజ్ అవుతదా? నాకీ కాదు మళ్ళ" అన్నాడు కోపంగా.

వాడి అనుకరణకి నాకు తెగ నవ్వొచ్చింది. "నీకెట్లా చేప్తే అర్ధం అవుతుందిరా? ఒక సత్యహరిశ్చంద్రుడనే రాజుండేవాడు.." అన్నా.

"సత్య అంటే?" అడిగాడు.

"నిజాలే మాట్లాడేవాడని అర్ధం"

"పుట్టగనే నిజాలు చెప్పిండా? గప్పుడు నోట్ల పళ్ళే రావు. అబద్దాలు ఏడికెల్లి చెప్తాడు?" అన్నాడు.

"పళ్ళకీ అబద్ధాలకీ ఏవిట్రా సంబంధం?" అన్నాను.

"నోట్ల పల్లు రాకముందు మా చిన్న సలీంగాడు అబద్దాలే చెప్పేటోడు కాదు. గిప్పుడు పుట్నాల పప్పులన్నీ ఖతం చేసి, భాయ్‌జాన్ ఖాయా` అని అబద్ధం చెప్తయ్. మొన్న నాకీ చెప్పిన యే `మక్కబుట్ట దాదీజాన్ ఖాయీ` అని. దాదీ జాన్‌కి పళ్ళున్నాయా? ఎట్ల తింటయ్?

జబ్ తక్ పళ్ళు నై ఆతా. ఆద్మీ అబద్ధం చెప్పయ్. పళ్ళు వచ్చినంక తిననీకి చోరీ చేస్తయ్. అబద్ధం చెప్తయ్. పోలీస్‌నే చోర్ కో .. పళ్ళు పీకేస్తే చోరీ చెయ్యవ్... అబద్ధం సెప్పెయ్" అన్నాడు ఆరిస్టాటిల్ అప్ప కొడుకులా.

కాసేపు నా కథ గురించి మర్చిపోయి, మనుషులందరినీ పళ్ళు లేకుండా వూహించుకున్నాను. తెరమీద శోభన్‌బాబూ, వాణిశ్రీలు పళ్ళులేకుండా దవడలు తాటిస్తూ "నిన్ను నేను.. ప్చ్..ప్చ ప్రేమిస్తు...న్నాను.. ప్చ్...ప్చ్...వాణీ!" అనడం కనిపించి తెగ నవ్వాను.

"సమజ్ అయిందా? గప్పుడే పుట్టినపిల్లగాడికి సత్యహరిచందర్ అని ఎపుడైనా పేరు పెడ్తడా?" అన్నాడు తెగ నవ్వి.

నేను ఓపిగ్గా "అతని పేరు హరిచందర్...ఛ. హరిశ్చంద్ర తర్వాత నిజాలే చెప్తాడు కాబట్టి సత్యహరిశ్చంద్ర అయ్యాడు. సరేనా?" అన్నాను.

సందానీ చిరాగ్గా "ఆయన రాజా వున్నాయ్. అబద్దాలు ఎందుకు సెప్తాయ్? రాజాకి బచ్చాలు (భక్షాలు) తినాలనిపిస్తే "కోన్ హై వుదర్?" అని సప్పట్లు కొట్టి బచ్చాలు లావో.. నాకీ తినాలని వుంది" అంటయ్ అని ఏక్ట్ చేసి చూపించాడు. "గదే గరీబ్ బిచారా అయితే ఎవురింట్ల అయిన బచ్చాలు చేస్తే పండుగకి, ఆ వాసనకి పోయిగాడనే చూరుపట్టుకు వూగుతయ్. వాళ్ళు పండుకుంటే గవి చోరీ చేస్తయ్. రాణీ టీచర్ 'కిస్‌మిస్' పండగకి బచ్చాలు చేస్తూ వుంటే, నేనూ, శీనుగాడూ, క్రరి చందూగాడు పోయి టీచర్‌కి వంట గదిల "ఏమైనా పని చెప్పు టీచర్" అని గాడనే వేలాడి పట్టినం.. టీచర్ "పోయి సదువుకోండిరా.." అన్నా, పోలేదు. "సెట్లు కత్తిరించనా?.. ఫ్యాన్‌కి అంతా దుమ్ము వుంది. తుడిసి పెట్టమా? దుకాన్‌కిపోయి ఏమైనా కొని తేవాలా?" అని నేను అడుగుతుంటే క్రరిచందూగాడు "మీకీ వీపు తొక్కాలా? మా నాయనకీ తొక్కినట్టూ?" అని అడిగిండు. రాణీ టీచర్ పొయ్యిల కెల్లి కట్టె తీసి మాకీ కొట్టనీకొచ్చింది. "బచ్చాలు వాసన చూసి వచ్చినయ్ టీచర్.. కోపం సెయ్యకు" అని చెప్పేసినా!.. గట్ల గరీబ్ వున్నప్పుడే కదా అబద్దాలు సెప్తయ్. మాకీ అబ్బాజాన్ రంజాన్ వస్తే ఇంజనీర్ ఇంటికిపోయి "ఖుదాఫీస్ సాబ్" అని "ఏందిరా భక్షీ ఇట్లొచినవ్?" అంటే "షీర్ కుర్మా తిననీకి" అని చెప్పయ్. " సకీనా కైసాహై సాబ్?"

"అచ్చా హై"

"సల్మాన్ కా ఆపా సకీనా కైసాహై?"

"బాగుంది"

"సకీనాకి చిన్న సెల్లి.. పేరేంది?"

"ఫాతీమా? మంచిగుంది"

"ఫాతీమాకీ మా కైసాహై?"

"తెరీ మా ... ఏందిరా నువ్వు? రేషన్ కార్డ్ ఇయ్యనీకొచ్చినవా? ఎలక్షన్ కార్డా?" అని ఇంజనీర్ సాబ్ గుస్సా చేస్తయ్. అప్పుడు లోపలికెల్లి ఇంజనీర్ సాబ్ కీ 'బీబీ' వచ్చి "బక్షీ.. ఖుదాఫీస్.. తోడా షీర్ కుర్మా తినిపో.. పిల్లగాల్లకి భీ ఇస్తా.." అంటే, గప్పుడు ఖుష్ అయి, బిగ్గర తిని, మాకీ బచ్చాలు తెస్తయ్! రాజు దగ్గర బచ్చాలు మస్త్ వుంటయ్.. ఎందుకబద్దాలు సెప్తయ్?" అని తన ప్రసంగాన్ని ముగించాడు. దరిద్రమే అన్ని దొంగతనాలకి మూల కారణం అని వాడుద్దేశం.

"సరేరా. సత్యహరిశ్చంద్రుడు కాదనుకో.. ఒట్టి హరిశ్చంద్రుడే. ఆయన ఆడిన మాట తప్పడు. అంటే.. ఎవరికైనా ఏదైనా మాటిస్తే తప్పనిసరిగా చేసేవాడు. అందుకే ఆయన గొప్పవాడు" అన్నాను.

"ఎవరికైనా మాట ఇస్తే చేస్తయా? గంతదానికే టెక్స్ట్ బుక్‌ల ఆయన ఇస్టోరీ రాస్తయ్? నేను నీకి చేపలు పట్టడం నేర్పిస్తయ్ అన్నా. నేర్పించినా .. ఆ కోమటాయన ఇంట్లకెల్లి జామకాయలు తెచ్చిస్తా అన్నా. ఎంత కష్టం అయినా తెచ్చిచ్చినా కదా!. గాయన చెట్టుకిందనే పండుకుంటయ్. రాత్రిగాదు, పొద్దుగాల కూడా. నీకి జామకాయ కోసం నేను చెట్టు పైకెక్కి ఆయన మీద మైదాపిండి కలిపి పోసినా" అని కిచకిచ నోటికి చెయ్యి అడ్డుపెట్టుకుని నవ్వి,

"కాకి రెట్ట అనుకుని, తానం చెయ్యనీకి పోయినయ్. నేను జామకాయలు తెంపుకుని, నీకి తెచ్చిచ్చినయ్.. నేను కూడా ఆడిన మాట తప్పినయా?" అన్నాడు.

"ఒరి నీ హరికథలు పాడుగాను.. నన్ను కథ చెప్పమంటావా? లేదా?" కోపంగా అడిగాను.

"సర్లే.. చెప్పు" అన్నాడు.

నేను చదవడం మొదలుపెట్టాను విసుగ్గా.

సందానీ అడ్డుపడలేదు. మొహం సీరియస్‌గా పెట్టి విన్నాడు మొత్తం కథ అయ్యేటప్పటికి అసలే ఎర్రగా వుండేవాడి మొహం. ఇంకా ఎర్రనయింది. ముక్కులు అదిరాయి. "విశ్వామిత్రకి రాజ్యం ఇచ్చేసి, రెండు కుండల బంగారం కోసం రాణీని అమ్మినయా? బేటాకి అమ్మినయా? మెహమాన్ కి ఖుష్ చెయ్యనీకి.. సొంతం బీవీకి బేటాకి అమ్ముతయా? గిసుంటి రాజాకి 'నిఖా' చేస్కునే బదులు మా 'బషీర్ మామా'కి నిఖా సేస్కుంటే ఆ రాణీ మంచిగుండేది. బషీర్ మామా పెండ్లాంకి, బిడ్డలకి మంచి కప్‌డే, ఇస్కూల్ ఫీజులు కోసం దుబయ్ పోయి మట్టి పని చేస్తయ్! రోజు మొత్తం, రాత్రి మొత్తం పని చేసినంక, రెండు రొట్టెముక్కలు తిని, పైసా అంతా 'బువా'కి పంపిస్తయ్. గాడ బషీర్ మామా కొత్త నిక్కర్ కూడా కొనుక్కోవు. గీడ మా బువా, అత్తర్ పూసి, చమ్‌కీ చీర మీద కొత్త బురఖా వేసి, దినాం 'గోష్' వండి పిల్లలకి తినిపిస్తయ్.. నుమాయిష్ వస్తే పిల్లగాల్లకి రంకులరాట్నం తిప్పిపిస్తయ్.."

"అది రంగులరాట్నం రా"

"గదే! పెద్ద బేటాకి ఇస్కూటర్ కొనిపించినయ్.. కొత్త సెనిమా వస్తే జుమ్మా జుమ్మా రిష్కాల సెనిమాకి పోతయ్. దుబాయ్ నుండి మామా బిస్కెట్లు తెచ్చినయ్. గుల్‌కోస్ బిస్కెట్ కాదు. బంగారం బిస్కెట్. బువా దాంతోని మెడల నలికీస్ ఇంకా ముక్కుకి గంటలు చేయిపించింది"

"ముక్కుకి గంటలు కావురా! జడగంటలు ఏమో!"

"గేడ చేయిస్తరో నాకు తెలవద్ కానీ సిన్న బిడ్డకి మెడల గొలుసు చెయిపించింది. కుక్కకి కూడా కొత్త చైన్ కొన్నది. ఇనపది గట్ల బషీర్ మామాని లగ్గం చేసుకున్నా, ఆ రాణీకి సుకంగా వుండేది. సుకూన్ లేనప్పుడు రాజాని చేస్కుని ఏం ఫాయిదా?" అన్నాడు.

"చంద్రమతి సత్యహరిశ్చంద్రుడిని కాకుండా మీ బషీర్ మామాని చేస్కోవలసింది అంటావ్? అంతేనా?" కోపంగా అడిగాను.

సందానీ అదే కోపంతో "బీవీని అమ్ముతయ్? గదేమైనా కోడా, మేకా? మా అమ్మీజాన్ 'కుషీ'కి అమ్ముతానంటే నేను కిందపడి ఏడ్చినయ్. రెండు దినాలు అన్నం తినలే.. చిన్నమ్మ కాడ జొన్న రొట్టె తిన్నా. అమ్మీజాన్ 'మేకనే కదరా. నీ అబ్బాజాన్ చేసేటి పనులకి ఒక దినం నిన్ను కూడా అమ్మాలనేమో!" అంది.

"అమ్మిందా?" ఆతృతగా అడిగాను.

"మల్లేష్ తాన రెండొందలు బయానా బీ తెచ్చుకుంది. నీ ఇస్కూల్ ఫీజ్ ఎవుడు కడ్తాడ్రా? మేకని అమ్మకపోతే?" అంది. అయినా నేను అన్నం తినలే. ఇస్కూల్‌కి పోలేదు. "ఏం చేస్తావురా? ఇస్కూల్‌కి పోకపోతే?" అంది. "మేకలు కాస్తా .. అయి నయం. వాటి పిల్లలకి అవి అమ్ముకోవు. నన్ను బీ మల్లేష్‌కి అమ్మెయ్. మేకలు తోలుకుపోతా.. నా కుషీ నాతోనే వుంటయ్" అన్నా!

"ఆ తర్వాతా?" ఇంకా ఆతృతగా అడిగాను.

"గట్లనే పడి సావు. నేను అమ్మేది అమ్మేదే. నాలుగొందలొస్తయ్. నజ్మాకి బట్టలు పట్టిపెయ్యాల గది ఆడపిల్ల. నీ మొకానికి నిక్కరుంటే సాలు" అంది. నేను రాత్రిపూట కూడా కుషీ మెడకి పట్టుకుని గట్లనే పడుకున్నా! నాకి మస్తు జొరం వచ్చింది. ఆర్.ఎమ్.పీ డాక్టర్ మందుకి తక్కువగాలే. అమ్మీజాన్ గవర్నమెంట్ ఆస్పటల్‌కి రమ్మంటే 'నేను రాను' నాకి కుషీకి విడచిబెట్టి" అన్నా.

అమ్మీజాన్ నెత్తి కొట్టుకుంది. "రేపు ఈద్‌కి నీ అబ్బా జాన్ తీస్కపోయి అమ్ముకుంటే ఈ నాలుగొందలు కూడా రావురా" అని. నేను కళ్ళు తుడుచుకుని అమ్మీజాన్‌తో "అబ్బా జాన్‌కి విడచి పెట్టేయ్" అన్నా. అమ్మీజాన్ "సువర్ క బచ్చా ఏం అన్నావురా?" అంది. "ఎందుకు ఒర్లుతున్నావ్? నీకీ ఈద్‌కి కొత్త చీర తెచ్చినయ్? మాకీ మిఠాయి తెచ్చినయ్? ఉన్న కుషీని అమ్ముతయ్? గసుంటి మరద్ నీకెందుకు? అబ్బాజాన్ మా కెందుకు?" అన్నా.

అమ్మీజాన్ నెత్తి కొట్టుకుని "తూ సోనా నా ప్యారే.. సోనా.." అని నన్ను బిగుతుగా పట్టుకుని ముద్దులు పెట్టినయ్." అని కళ్ళు తుడుచుకున్నాడు ఆనందంగా.

నాకూ కళ్ళల్లో నీళ్ళొచ్చి గౌనుతో కళ్ళు తుడుచుకున్నా! వాళ్ళమ్మీ జాన్ మంచిదే పాపం. డబ్బుల్లేక అలా కుషీని అమ్మేద్దాం అనుకుంది అనుకున్నా.

"తర్వాత ఏమైంది? కథ సదువు" అన్నాడు సందానీ.

"ఒరే! నా ప్రతిమాటకీ ఓ కథ చెప్పావు కదరా! ఇంకేం ముందుకెళ్తుంది నా కథ? మొత్తం నీ ఖాందాన్ కథలన్నీ విన్నాను.. సత్య హరిశ్చంద్రుడి కథ మరిచిపోయాను" అన్నాను.

సందానీ ఈద్ కా చాంద్‌లా నవ్వాడు.

"ఇక్ష్వాకు వంశంల రాజులందరికి గిట్ల కష్టాలు తప్పవా? ఇంక నాకే ఈ యాష్టలనుకున్నా" అన్నాడు.

నేను పుస్తకం మూసాను. "రేపు తెలుగు పండిట్ కథ చదివావా? చెప్పమంటే ఏం చెప్తావు? అని అడిగాను.

సందానీ నవ్వి "నేను సత్య హరిచందర్ కా రాణీ అయితే "ఒక్క జూట్ చెప్తే.. మనకీ రాజ్యం పొయ్యేదికాదు. మనకీ పిల్లగాడూ పొయ్యేది కాదు. జిందగీ అంతా బర్బాద్ అయినంక 'జూట్' చెప్పనందుకు, నీకీ సొర్గం వస్తే నాకి ఏం ఫాయిదా రాజా? నేను నా నాయిన దగ్గరా పోతయ్' అనేవాడ్ని" అన్నాడు. నేనూ సందానీని రాణీలా వూహించుకుని నవ్వాను.

"సొర్గంల ఏం వుంటయే?" మళ్ళీ అడిగాడు. నేను కళ్ళు మూసుకుని కాసేపు ఆలోచించాను "అక్కడ ఇళ్ళన్నీ బంగారంతో వుంటాయిట్రా. ఇళ్ళముందు చెరువులులో నీళ్ళు కాదు. పాలు, తేనె, కొబ్బరి నీళ్ళూ పారతాయి. చెట్లనిండా క్యాడ్‌బరీస్ చాక్లెట్లూ బంగారు చెట్లకి లడ్లూ బాదుషాలూ కాస్తాయిట. తెంపుకుని తింటే ఎవరూ ఏమీ అనరు. నెమళ్ళూ, జింకలూ, పావురాలూ, కుందేళ్ళూ మన చుట్టూ తిరుగుతూ ఆడ్తాయి. ఎవరూ కోసుకుని తినెయ్యరు. రామ చిలుకలూ, హంసలూ అన్నీ మనతో మన భాషలో మాట్లాడ్తాయి. చక్కగా ఒక చోటనుండి ఒక చోటకి మనమే ఎగరచ్చు. మనకీ తెల్లటి రెక్కలొస్తాయి. కళ్ళు మూసుకుని ఏం అప్పచ్చులు. అదే నీ బచ్చాలు కోరుకున్నా వెంటనే కళ్ళ ముందుకొచ్చేస్తాయి. కొత్తబట్టలూ, చెప్పులూ అన్నీ బంగారంతోనే చేస్తారు. ఏం కావాలన్నా డబ్బులు ఇవ్వక్కర్లేదు. తీసేసుకోడమే" అన్నాను.

సందానీ మొహం చింకి చేటంత అయింది. "మరి కుషీకి గడ్డీ, ఆకులూ ఎలా? చెట్లన్నీ బంగారంతోనే వుంటే?" అన్నాడు.

"కుషీని రానివ్వరురా" అన్నాను.

వాడి మొహం వాడిపోయింది.

"అయితే నాకు సొర్గం వద్దు." అన్నాడు.

నేను నిట్టూర్చాను.

నేనూ, వాడి మాసిపోయిన పుస్తకాల సంచీ, తెగిన చెప్పూ, దానికి మేకు కొట్టుకోడానికి సంచిలో రాయీ, పక్కన కుషీ చేతిలో దానికోసం ఓ వేపాకుకొమ్మా, నేను తెచ్చే జీళ్ళూ, సీసాలో నీళ్ళూ.. ఇవే వాడి స్వర్గం.

Post your comments




